క్లుప్తంగా

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ డిపో అధ్యక్షులు సగినాల శ్రీనివాసులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు, ఆర్టీసీ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ



పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్ : నగరంలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని అజిత్ కుమారి (కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్) ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ మురళీకృష్ణ సహకారంతో శనివారం కంప్యూటర్, ప్రింటర్, అడాప్టర్‌ను వితరణగా అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కడప ఎంఈఓ ఇర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థి సహకారంతో పాఠశాలకు వస్తువులు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మరియాపురం బ్రాంచ్ మేనేజర్ సంపత్ కుమార్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్ సాగర్ పాల్గొన్నారు.

వైవీయూ ప్రతిష్టను కాపాడాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వైవీయూ వీసీ కృష్ణారెడ్డిని తొలగించి యూనివర్సిటీ ప్రతిష్టను కాపాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినవారు విద్యాసంస్థల్లో పదవులలో ఉండటం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు శివశంకర్, చంద్ర, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కేడెట్స్ విజయవాడలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా అభినందించారు. కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ ఎ. స్రవంతి, ఎస్. నఫియా, కె. శ్రీవాణిలు పాల్గొన్నారు. వారు మార్చ్‌ఫాస్ట్‌లో ప్రథమస్థానంలో నిలవడం కళాశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డాక్టర్ బి. స్వరూప, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సి.వి.కృష్ణవేణి, హరిత, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ హైస్కూల్ సందర్శన

కడప ఎడ్యుకేషన్ : కడప గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన లీగల్ లిటరసీ క్లబ్‌ను శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ లిటరసీ క్లబ్‌లో ఉన్న న్యాయ సంబంధిత పుస్తకాలను, కంప్యూటర్స్‌ను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే వారికి న్యాయ, చట్టాలపైన అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



కోలాటం ఆడుతున్న చిన్నారులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని పలు పాఠశాలలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయిబాబా హైస్కూల్, సాయికృష్ణ ఇంగ్లీష్ మీడియంస్కూల్, రాయలసీమ స్కూల్, నారాయణ స్కూల్‌లలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో వచ్చి అలరించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని చిన్నారులు నిర్వహించారు.

'సెక్యూరిటీ' బలంగా ఉండాలి



కడప రిమ్స్ ఆవరణలో ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది ఎక్కువ మంది విధులలో ఉంటారు. వీరందరికీ పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలి. రిమ్స్ మార్గంలో పోలీసుల పెట్రోలింగ్ కూడా మరింత పెంచాలి.

– డాక్టర్. సి. విష్ణువందన, జిల్లా సత్వర చికిత్స కేంద్రం, కడప



భద్రత చాలా అవసరం



ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య శాలల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది ప్రతీ ఒక్కరికీ భద్రత అవసరం. అధికారులు, పోలీసులతో సమన్వయపరిచి విధుల పరిసర ప్రాంతాలలో రక్షణను కల్పించాలి. నేరాలు జరిగే అవకాశం లేకుండానే నియంత్రించాలి. దూర ప్రాంతాల నుంచి విధులకు వచ్చే వారికి రక్షణ కల్పించాలి.

– వి. వెంకటలక్ష్మి, ఎఫ్.ఎన్.ఓ., ప్రభుత్వ సర్వజన వైద్యశాల (రిమ్స్), కడప

సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి..



ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సెలవు దినాల్లో కేవలం స్టాఫ్ నర్స్‌లు మాత్రమే ఉంటారు. ఆసుపత్రికి ఒక సెక్యూరిటీ గార్డును నియమించాలి. వైద్యులు..వైద్య సిబ్బందిపై ఎలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– పీ నారాయణమ్మ, స్టాఫ్ నర్స్, కడప

కృష్ణం వందే జగద్గురుం

రేపు శ్రీ కృష్ణ జన్మాష్టమి

కడప కల్చరల్ : శ్రీకృష్ణ్ణ...గడసరి తనం, ధీరోదాత్తత, రాజకీయ చతురత, ధర్మకర్తవ్య నిరతికి ప్రతిరూపం. ఇంతటి విభిన్నమైన జీవన గమనం గల పాత్ర పురాణాలలో మరేది కనిపించదంటారు పెద్దలు. అష్టమినాడు కష్టాల మధ్య పుట్టి చిన్న గ్రామంలోపెరిగి మహాయుద్ధం కురుక్షేత్రంలో ప్రధానపాత్ర వహించిన శ్రీకష్ణుని జన్మదినం సోమవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

మన దేశం సంస్కృతి సంప్రదాయాలకు నిలయం. ఇక్కడ పురాణాలు, ఇతిహాసాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా మహాభారతం, అంతకుమించి అందులోని భగవద్గీతలను ఎంతో ఆరాధిస్తారు. గీతాచార్యులు శ్రీకృష్ణుడిని దేవుడిగా పూజిస్తారు. ఆయన భారత, భాగవతాలు రెండింటిలోనూ ప్రధానపాత్ర వహించాడు.

గోవుకు పూజార్హత..

రాచబిడ్డడైన శ్రీకృష్ణుడు గోకులం చేరి గోపాలకుడయ్యాడు. అక్కడి గోపాలురకు ప్రియ మిత్రుడయ్యాడు. ప్రకృతి ఒడిలో లీనమై గోవులకు పూజార్హత కల్పించాడు. తల్లిలాంటి పల్లెల విలువలను తెలిపాడు. కృష్ణుడు అష్టమినాడు గోకులంలో జన్మించాడు గనుకే ఆయన జన్మదినాన్ని గోకులాష్టమిగా పేర్కొంటారు. ప్రభుత్వం కూడా గోవుల సంరక్షణకు ప్రత్యేక పథకాలను ఏర్పాటు చేస్తోంది. పలు స్వచ్ఛంద సంస్థలు కూడా గోశాలలు ఏర్పాటు చేస్తున్నాయి. జిల్లా అంతటా దాదాపు 100 గోశాలలు ఉండగా, కేవలం కడప నగర శివార్లలోనే ఐదు గోశాలలు ఉండడం విశేషం. జిల్లాలో ప్రత్యేకించి శ్రీకష్ణునికి ఆలయాలు తక్కువేనని చెప్పవచ్చు. కడప నగరం ద్వారకానగర్‌లోని శ్రీ మురళీ కృష్ణాలయం, రాయచోటిరోడ్డులోని శ్రీకృష్ణాలయంతోపాటు జమ్మలమడుగు వద్ద రథంరూపంలో గల భారీ శ్రీకృష్ణాలయం, రాయచోటి మోటకట్ల వద్ద కృష్ణాలయం ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

కృష్ణుని సేవలో.. కడప కవులు..

శ్రీకృష్ణ లీలలను వివరించే మహాభాగవతాన్ని పోతన మన జిల్లాలోని ఒంటిమిట్ట దివ్య క్షేత్రంలో రచించారు. ఇంకా ప్రముఖ ఇంజనీరు పుత్తా పుల్లారెడ్డి భాగవత నామ సర్వస్వం పేరిట అందులోని 4124 పేర్లు, వాటి వివరాలతో 450 పేజీల పుస్తకాన్ని వెలువరించారు. పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు భాగవత సుధాలహరి, జనమంచి శేషాద్రిశర్మ శ్రీకృష్ణావతార తత్వం, వావిలికొలను సుబ్బారావు శ్రీకృష్ణా లీలా తరంగిణి, మైనంపాటి సుబ్రమణ్యం శ్రీకృష్ణ తాండవం రచించారు. జిల్లాకు చెందిన ఆధ్యాత్మికవేత్త అచ్చోలు పుల్లారెడ్డి భగవద్గీతను విశేషంగా ప్రచారం చేశారు.

కిటకిటలాడనున్న ఆలయాలు..

ఏటా కృష్ణాష్టమిని జిల్లాలో ఘనంగా నిర్వహిస్తారు. తెల్లవారు జామునుంచి చిన్నారి బాలలు కృష్ణుని వేషంలో సందడి చేస్తారు. యువకులు ఉట్టి కొట్టి ఆనందిస్తారు. ఈ సందర్భంగా నగర వాసులు పెద్ద సంఖ్యలో ఉదయం, సాయంత్రం తమకు సమీపంలోని శ్రీకృష్ణుని దేవాలయాలకు కుటుంబాలతో సహా తరలివస్తారు. ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో బాలలు సైతం స్వామిని దర్శించుకుంటారు. పలు పాఠశాలల్లో తమ విద్యార్థులతో శ్రీకృష్ణునిపై చిన్నస్కిట్‌లు ప్రదర్శింపజేస్తారు. మరికొన్నిచోట్ల చిన్నారి బాలలకు శ్రీకృష్ణుడు, గోపెమ్మలుగా అలంకారం చేసి తల్లిదండ్రులు ఆనందిస్తారు. ముఖ్యంగా బాలలు, యువతకోసం ఉత్సవాల్లో భాగంగా ఆలయాల వద్ద సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహిస్తారు.



కడప నగరంలోని ద్వారకానగర్‌లోగల శ్రీకృష్ణాలయం

ఆర్తీ హోంలో లిల్లీసింగ్



ఆర్తీ హోంలోని చిన్నారులతో లిల్లీసింగ్

కడప కల్చరల్ : కెనడాకు చెందిన లిల్లీసింగ్ కడప నగరంలోని ఆర్తీ హోంను సందర్శించారు. తల్లి మాల్విందర్‌కౌర్‌తో కలిసి ఆమె కడపకు విచ్చేశారు. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు 15 మిలియన్లకు మించిన ఫాలోయింగ్ ఉన్న విషయం తెలిసిందే. రచయిత్రిగా, దర్శకురాలిగా, నిర్మాతగా, సంఘ సంస్కర్తగా ఎంతో ప్రాచుర్యం ఉన్న ఆమె తన యూనికార్న్ ఐల్యాండ్ ద్వారా సామాజిక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిన మహిళగా విశేషమైన గుర్తింపు సాధించుకున్నారు. ఆర్తీ హోంలో ఆమె ప్రతి విభాగాన్ని సందర్శించారు. హోం వ్యవస్థాపకులు, అధ్యక్షులు పీవీ సంధ్య హోం గురించిన వివరాలకు ఆమెకు తెలిపారు. 32 సంవత్సరాలుగా సంస్థ చేపట్టిన కార్యక్రమాలు, సామాజిక సేవల గురించి వివరించారు. అనంతరం ఆమె ఆ ప్రాంగణంలోని ఆర్తీ స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులతో గడిపారు. పాఠశాల డైరెక్టర్ భాగమ్మ, ప్రధానోపాధ్యాయులు ఓబులేశులతో పాఠశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో ఆటపాటలతో గడిపి వారి లక్ష్యాలను తెలుసుకున్నారు. ఆర్తీ ఉమెన్స్ సెంటర్‌లోని విద్యార్థి బృందం వారికి ఘనంగా స్వాగతం పలికింది. సంప్రదాయ పద్ధతిలో వారికి గౌరవం కల్పించి మహిళల కోసం నిర్వహిస్తున్న శిక్షణలు, ఇతర కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో హోం అధ్యక్షులు సంధ్య, కార్యదర్శి దుర్గాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ హాస్టల్స్‌లో సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా కేజీబీవీ హాస్టల్స్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీస్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు కోరారు. ఈ విషయమై శనివారం డీఈఓ, సమగ్రశిక్ష అధికారి మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కస్తూర్బా గాంధీ పాఠశాలలు, కళాశాలల హాస్టల్స్ సమస్యలకు నిలయంగా మారాయన్నారు. చాలా హాస్టల్స్‌లో మెనూ అమలు చేయడం లేదన్నారు. దీంతోపాటు విద్యార్థినిలకు సరైన సదుపాయాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డీఈఓను కోరారు.

మత్తు పదార్థాలతో జీవితం ఛిద్రం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ

వైవీయూ : మత్తు పదార్థాలు జీవితాలను హరించి వేస్తాయని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్–6 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కోట మృత్యుంజయరావు ఆధ్వర్యంలో డ్రగ్ అండ్ యాంటీ–టొబాకో అవేర్‌నెస్ ప్రోగ్రాం శనివారం ఆర్ట్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య పద్మ మాట్లాడుతూ తొలుత సంతోషం కోసం, స్నేహం బలపడేందుకు అంటూ అలవాటయ్యే మద్యం, మత్తు పదార్థాలు క్రమంగా బలహీన స్థితికి తీసుకొస్తాయని, యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, పొగాకు, ఖైనీ, ఓపియం, గుట్కా, మద్యం ఇవన్నీ మనుషుల ఆరోగ్యాలను, ప్రవర్తనను దిగజారుస్తాయన్నారు. హ్యూమానిటీ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య, ఆంగ్ల శాఖ విభాగాధిపతి ఆచార్య జి. మెర్సీవిజేత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా కె. మృత్యుంజయరావు మాట్లాడారు. అనంతరం విద్యార్థుల చేత మత్తు రహిత సమాజం కోసం పాటుపడదామని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు, సహా ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాటినం జూబ్లీ వేడుకలు విజయవంతం చేయాలి



ప్లాటినం జూబ్లీ వేడుకల నిర్వహణ కమిటీతో చర్చిస్తున్న ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో నిర్వహిస్తున్న ప్లాటినం జూబ్లీ సంబరాలను విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. శనివారం కళాశాలలో ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 13 నుంచి 15వ తేదీ వరకు వేడుకలను కళాశాలలో నిర్వహించనున్నామన్నారు. సిల్వర్‌జూబ్లీ సెలబ్రేషన్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య పి. రాజశేఖర రెడ్డి మూడురోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల షెడ్యూల్ వివరించారు. కార్యక్రమంలో అలుమ్నీ అసోసియేషన్ కార్యదర్శి శివరాం పాల్గొన్నారు.

రూ.1.50 లక్షలు చెక్కు అందజేత..

ఆర్.ఆర్. స్టోన్స్ అధినేత దివంగత సజ్జల దివాకర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సోదరుడు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సజ్జల జనార్దన్‌రెడ్డి రూ.1.50 లక్ష చెక్కును కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. జీపీసీ కోర్సులో ప్రతిభావంతులకు ఆయన జ్ఞాపకార్థం మెడల్, నగదు బహుమతి అందజేయనున్నారు. దీంతో పాటు రూ.30 వేలు సావనీర్ రూపకల్పనకు వితరణగా అందజేశారు.

ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో వర్క్‌షాప్



ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో సీడీఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు

కడప అర్బన్ : డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దంతవైద్య కళాశాలలోని ఓరల్ పెథాలజీ విభాగంలో సీడీఈ (కంటిన్యూయింగ్ డెంటల్ ఎడ్యుకేషన్) వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు డాక్టర్ కె. కిరణ్‌కుమార్, డాక్టర్ రాజేష్ కృష్ణ 'లాలాజల గ్రంధులకు సంబంధించి వ్యాధుల మీద ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 20 మంది పోస్ట్‌గ్రాడ్యుయేట్ దంత వైద్య విద్యార్థులతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. జ్యోత్స్న, అధ్యాపకులు డాక్టర్ సుప్రజ, డాక్టర్ దాశరథి, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

39వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జి కమాల్‌బాషా మృతి



కమాల్‌బాష (ఫైల్)

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలో 39వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జిగా ఉన్న షేక్ కమల్‌బాష (52) శనివారం సాయంత్రం కన్నుమూశారు. 5.20 గంటల ప్రాంతంలో మోచంపేటలోని రఫీబ్‌షావలీ మసీదులో ప్రార్థనలు చేస్తూ గుండెపోటుకు గురై మృతి చెందారు. ఈయన సతీమణి షబానా బేగం 39వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కమాల్‌బాష అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం కృష్ణా సర్కిల్ వద్దగల యాకూబ్ సాహెబ్ మసీదులో జరుగుతాయని బంధువులు తెలిపారు.

ఘనంగా మరియమాత గ్రామోత్సవం

వల్లూరు : మండలంలోని పైడికాలువలో వెలసిన పునీత మరియ మాత మాతృత్వపు దేవాలయ (చర్చి) సిల్వర్ జూబ్లీ వేడుకల్లో శనివారం మరియ మాత గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శివాలయం వద్ద నుంచి శీతోరుపల్లె వరకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. నెల్లూరు వారు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ వైఓ నందన్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. శనివారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ప్రకాష్ నగర్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. అక్కడ పూడిక తీత పనులను పరిశీలించారు. డ్రైనేజీకి ఏవీ అడ్డుపడకుండా తొలగించాలన్నారు. కాలువల్లో స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ వేసి దోమలను అరికట్టాలన్నారు. పిచ్చి మొక్కలు, నీటి నిల్వలను తొలగించాలన్నారు. కల్వర్టుల కింద ఉండే చెత్తచెదారం, మురికిని తొలగించాలన్నారు. ప్రకాష్‌నగర్‌లో హెచ్‌డీపీఈ ఇంటర్‌కనెక్షన్ల పనులను ఆయన పరిశీలించారు. తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు దైవభక్తి నేర్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నేటి సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు దైవభక్తితోపాటు విలువలు నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమెన్ మినిస్ట్రీస్ డైరెక్టర్ సుభాషిణి పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని సెవెంత్ –డే అడ్వంటిస్ట్ సెంట్రల్ చర్చిలో ఉమెన్ మినిస్ట్రీస్ కడప శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుభాషిని పాల్గొని మాట్లాడారు. ఇటీవల మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇలాంటి ఆగడాలకు అడ్డుకట్ట పడాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు ఉత్తమ జీవితాన్ని గడిపేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించాలన్నారు. అనంతరం ఆమె వాక్య సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పాస్టర్ ఎంఎం శాంసన్, సెక్రటరీ ఎలీషా, ట్రెజరర్ రాంబాబు, డైరెక్టర్స్ ప్రకాష్,, జాన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కల్యాణం.. కమనీయం

కడప కల్చరల్ : శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా కడప నగర శివార్లలోని పాలకొండల్లో శ్రీ పాలకొండ్రాయస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రతినిధులు, ఈఓ శ్రీధర్‌ల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత అర్చకులు యోగీశ్వరశర్మ బృందం స్వామి, అమ్మవార్ల మూర్తులకు కల్యాణ క్రతువును నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అడుగడుగునా గోవింద నామస్మరణలు చేశారు.

వెల్లువెత్తిన శుభాకాంక్షలు



రవీంద్రనాథ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



కడపలోని వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు



రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజుల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న షేక్ ఇస్మాయిల్

కడప కార్పొరేషన్: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కమలాపురం మాజీ శాసనసభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి ఆయనకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ఆయన్ను ప్రత్యేకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, షఫీ, కోలాకొండయ్య, అజ్మతుల్లా, బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి, మల్లీశ్వ రి, తలశమ్మ, పద్మ, సుశీలమ్మ తదితరులు నూతన జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డికి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డికి అభినందనలు తెలిపారు.

■ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కమలాపురం మాజీ శాసనసభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డికి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్‌ఆర్‌సీపీ మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ శుభాకాంక్షలు తెలిపారు. చిత్రపటాలు అందజేశారు.